ఆదివారం
11-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 81
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
# విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## పాకిస్తాన్‌కు 18 బిలియన్ డాలర్ల నష్టం

పాకిస్తాన్‌ను వరదలు ముంచెత్తాయి. దాయాది దేశంలో తీవ్రస్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. భారీ వర్షాలు, వరదలతో పాటు ఉక్రెయిన్-రష్యా యుద్ధ పరిస్థితుల క్రమంలో పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నది. వరదల వల్ల 18 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్లు నివేదికలు చెబుతున్నాయి.

2లో

### బ్రిటన్ రాచరికంలో
# కొత్తశకం

- రాజుగా చార్లెస్‌కు బాధ్యతలు
- అమ్మే ఆదర్శం: తొలి ప్రసంగంలో కింగ్‌చార్లెస్
- 19న అంత్యక్రియలకు బైడెన్ హాజరు

**లండన్:** బ్రిటన్ రాచరికంలో నవశకం మొదలైంది. కొత్త రాజుగా చార్లెస్-3 బాధ్యతలు చేపట్టారు. రాణి ఎలిజబెత్-2 మరణానంతరం ఆమె పెద్ద కుమారుడు, వేల్స్ యువరాజు చార్లెస్ పట్టాభిషేకం జరిగింది. బ్రిటన్ కొత్త రాజు 'కింగ్ చార్లెస్' అని అధికారిక ప్రకటన వెలువడింది. చారిత్రక సెయింట్ జేమ్స్ అంత:పురంలో జరిగిన కార్యక్రమంలో చార్లెస్ భార్య, క్వీన్ కాన్సర్ట్ కెమిల్లా, వారి కుమారుడు ప్రిన్స్ విలియమ్స్‌తో పాటు అతిథుల సమక్షంలో రాజుగా చార్లెస్(73) పేరును అధికారికంగా ప్రకటించారు. అంతకుముందు సీనియర్ మంత్రులు, న్యాయమూర్తులు, మత పెద్దలు సమావేశమయ్యారు. ఈ భేటీలో మొదట బ్రిటన్ రాణి ఎలిజబెత్ మరణాన్ని అధికారికంగా ప్రకటించిన అనంతరం కొత్త రాజుకు తమ విధేయత తెలిపారు. సంబంధిత పత్రంపై బ్రిటన్ ప్రధాని, కాంటర్‌బరీ ఆర్చ్‌బిషప్, లార్డ్ ఛాన్సలర్, సీనియర్లు సంతకాలు చేశారు. రాజుగా చార్లెస్ పట్టాభిషేకానికి కొంత సమయం పట్టనున్నదని, ఈ ప్రక్రియ సుదీర్ఘంగా ఉండటమే కారణమని బకింగ్‌హామ్ ప్యాలెస్ వర్గాలు వెల్లడించాయి. ఎలిజబెత్‌ను 1952 ఫిబ్రవరిలో రాణిగా ప్రకటించగా ఆమె పట్టాభిషేకం 1953 జూన్‌లో జరిగింది. 900 ఏళ్లుగా పట్టాభిషేక మహోత్సవం జరుగుతున్న వెస్ట్‌మినిస్టర్ అబేలోనే చార్లెస్ పట్టాభిషేకం కూడా జరగనుంది. మతపరమైన కార్యక్రమం తర్వాత సెయింట్ ఎడ్వర్డ్ కిరీటాన్ని చార్లెస్ తలపై పెద్దలు అలంకరిస్తారు. ఈ స్వర్ణ కిరీటాన్ని 1661లో తయారు చేశారు. దీనిని పట్టాభిషేకం సమయంలో మాత్రమే ధరిస్తారు. ఇది 2.23 కిలోల బరువు ఉంటుంది. బ్రిటన్ 40వ రాజుగా ఛార్లెస్ చరిత్ర పుటల్లో నిలవనున్నారు. రాజుగా స్కాట్లండ్ చర్చిని పరిరక్షిస్తానని పట్టాభిషేకం సమయంలో చార్లెస్ ప్రమాణం చేస్తారు. 18వ శతాబ్దం నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. చార్లెస్ రాజుగా బాధ్యతలు చేపట్టనుండటంతో ఆయన పెద్ద కుమా రుడు విలియం యువరాజు అయ్యారు. దీంతో ఇకపై ఆయనను ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌గా విలియం సతీ మణి కేట్ మిడిల్టన్‌ను ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు కింగ్ చార్లెస్ తన ప్రసంగంలో అధికారికంగా ప్రకటించారు. బాధ్యతలు స్వీకరణ

- మిగతా 2 లో

# 15 నుంచి అసెంబ్లీ

- ఉదయం 9 గంటలకు శాసనసభ, 10కి మండలి ప్రారంభం
- ఐదు రోజుల పాటు కొనసాగే అవకాశాలు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 15న ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శాసనసభా సమావేశాలు ఐదు రోజులపాటు కొనసాగే అవకాశాలున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే కచ్చితంగా ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహించాలనే అంశంపై బీఏసీ నిర్ణయం తీసుకుంటుంది. అదేరోజు ఉదయం 10 గంటలకు ఏపీ శాసన మండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. మండలి సమావేశాలు కూడా ఐదు రోజుల పాటు కొనసాగనున్నాయి. వాస్తవానికి తొలుత

- మిగతా 2 లో

# పాదయాత్ర భగ్నానికి కుట్రలు

## తెరపైకి అమరావతి మున్సిపాలిటీ ప్రతిపాదన

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** సెప్టెంబరు 12నుంచి అమరావతి రాజధాని రైతులు ప్రారంభిస్తున్న మహా పాదయాత్రను భగ్నం చేసేందుకు అధికార పార్టీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. తొలినుంచి అమరావతి విధ్వంసమే లక్ష్యంగా పనిచేస్తున్న వైసీపీ ప్రభుత్వం...దీనిపై జరిగే ప్రజా పోరాటాన్ని అణచేందుకు అస్త్రశస్త్రాలు సంధిస్తోంది. హైకోర్టు తీర్పును సైతం ప్రభుత్వం అమలు చేయకపోవడంతో రైతులు మరో పాదయాత్రకు సిద్ధమయ్యారు. దీనిని ఎలాగైనా నిలువరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. దీనిలో భాగంగానే రైతులు పాదయాత్ర నిర్వహణకు నెలరోజుల ముందు అనుమతి కోరినా పోలీసులు స్పందించలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు రైతులు పిటిషన్‌పై తీవ్రంగా స్పందిస్తూ పాదయాత్ర అనుమతిపై ఎటువంటి నిర్ణయం చెప్పకుండా పోలీసులు ఎందుకింత తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించింది. హైకోర్టు ఇచ్చిన గడువు ముగుస్తుందనుకున్న చివరి నిమిషంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశాలున్నందున రైతుల పాదయాత్రకు అనుమతి నిరాకరిసున్నట్లు డీజీపీ తెలిపారు. దానిపై రైతులు హైకోర్టును ఆశ్రయించగా పోలీసు తీరును తప్పు బట్టింది. వేలాదిమందితో రాజకీయ నాయకుల పాదయాత్రకు భద్రత కల్పించి గల్గినప్పుడు, కేవలం 600 మంది రైతులకు భద్రత ఇవ్వలేరా అంటూ పోలీసులను ప్రశ్నించింది. ఆందోళన చేసే హక్కు రాజ్యాంగమే కల్పించిందని గుర్తు చేసింది. వెంటనే రైతుల పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని, వారికి భద్రత కల్పించాలని ఆదేశించింది. దీంతో అప్పటికే అమరావతి మున్సిపాలిటీ ఏర్పాటు ప్రతిపాదన తెరపైకి తీసుకొచ్చిన ప్రభుత్వం, రైతులను పాదయాత్రలో పాల్గొనకుండా మానసికంగా వేధించేందుకు 12వ తేదీ నుంచి రాజధాని గ్రామాల్లో గ్రామ సభల నిర్వహణకు రంగం సిద్ధం చేసింది. గ్రామ సభల్లో ఏ నిర్ణయం చెప్పకపోతే ఆమోదించాల్సి వస్తుందని ప్రభుత్వం తెలిపింది. మరోపక్క ఈనెల 19నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలన్న యోచనను కూడా ముందుకు జరిపింది. ఈనెల 15నుంచే అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిలో మరలా మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెడతామని వైసీపీ మంత్రులు, నేతల చేత విస్తృత ప్రచారం చేయిస్తోంది. రైతుల పాదయాత్రను ఉత్తరాంధ్రపై దండయాత్రగా పేర్కొంటూ వైసీపీ నేతలు ప్రాంతీయ చిచ్చు రేపేందుకు యత్నిస్తున్నారు. పాదయాత్ర అమరావతి నుంచి అరసవిల్లి వరకు నిర్వహిస్తుండగా, ఆయా నియోజకవర్గాల పరిధిలోని వైసీపీ నేతలు పాదయాత్రపై దుష్ప్రచారం చేస్తూ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారు. మరోవైపు కోర్టు ఆదేశాల ఉల్లంఘన పేరుతో పాదయాత్రలో పాల్గొనే, సహకరించే వారిపై అక్రమ కేసుల బనాయింపునకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

### సీపీఎస్‌పై రెండు నెలల్లో
# నిర్ణయం

- మూడు నెలల్లోగా విద్య, వైద్య శాఖల్లో పదోన్నతులు
- మంత్రి బొత్స సత్యనారాయణ

**విశాలాంధ్ర-విజయనగరంటౌన్:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) కంటే మెరుగైన ప్రయోజనాలు ఉద్యోగులకు కలిగేలా నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఆదేశించారని, దీనిపై రెండు నెలల్లోనే ప్రభుత్వ స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. చర్చల ద్వారానే ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని మంత్రి పేర్కొన్నారు. సీపీఎస్ రద్దుపై వైసీపీ హామీ ఇచ్చిన మాటను కాదనడం లేదని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 95శాతం మేరకు తమ ప్రభుత్వం అమలు చేసిందని, అందులో 5శాతం మిగిలి ఉన్నాయన్నారు. సీపీఎస్ రద్దు అందులో ఒకటని తెలిపారు. సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా అనేక పరిష్కారాలను ఉద్యోగుల ముందుంచామని మంత్రి చెప్పారు. విజయనగరంలోని స్థానిక జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 4వ జిల్లా మహాసభలో మంత్రి బొత్స ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్య, వైద్య శాఖల ఉద్యోగులకు మూడు నెలల్లో పదోన్నతులు కల్పిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌కు విద్య, వైద్యం రెండు కళ్ల వంటివని తెలిపారు. ఈ రెండు శాఖలపై ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు. రాష్ట్రంలో పీహెచ్‌సీలు సీహెచ్‌సీల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీ ఉండకుండా నిర్దిష్ట కాలవ్యవధిలో నోటిఫికేషన్‌లు జారీచేసి పోస్టులన్నీ భర్తీ చేయాలని సీఎం ఆదేశాలిచ్చారన్నారు. విద్యాశాఖలోనూ టీచర్ నుంచి

- మిగతా 2 లో

# అమరావతి ఉద్యమం @ 1000

- చరిత్ర పుటల్లో ఇదో సుదీర్ఘ ప్రజా పోరాటం
- అరెస్ట్‌లు, కేసులు, వేధింపులను లెక్కచేయని రైతులు
- రాజధాని రక్షణ, నిర్మాణమే లక్ష్యంగా నిరంతర పోరు
- రేపట్నుంచి 'అమరావతి-అరసవిల్లి' రైతుల మహా పాదయాత్ర
- వెంకటపాలెం వెంకటేశ్వర ఆలయం నుంచి రథం ప్రారంభం

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** అమరావతి రాజధాని రైతుల ఉద్యమం ఈనెల 12వ తేదీకి 1000 రోజులకు చేరుతుంది. ఇది భారతదేశ చరిత్ర పుటల్లో నిల్చిపోయే అరుదైన సుదీర్ఘ ప్రజాపోరాటం. ఈ వెయ్యి రోజుల ఉద్యమ ప్రస్తానంలో ఆందోళనకారులపై రాష్ట్ర ప్రభుత్వం దమనకాండ కొనసాగించింది. బ్రిటీషు పాలనా కాలంలోనూ ఈ తరహా అణచివేత ధోరణి కొనసాగిన పరిస్థితి లేదని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రత్యక్షంగా చవి చూసిన వృద్ధ రైతులు చెప్పడం ఇక్కడ గమనార్హం. రాజధాని లేని రాష్ట్రానికి ఉచితంగా భూములిచ్చిన రైతులను రాష్ట్రం యావత్తూ గౌరవించాల్సి ఉండగా, వైసీపీ ప్రభుత్వం మాత్రం వారిపై కక్ష కట్టింది. రాజధాని ప్రాంతంలో వైసీపీ ఎమ్మెల్యే గెలిచినప్పటికీ, కనీసం ఆ కృతజ్ఞత కూడా లేకుండా వారిపై ప్రతిపక్షపార్టీకి చెందిన వారిగా ముద్ర వేసి పగ బూనింది. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజే రివర్స్ టెండర్స్ పేరుతో రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటినీ నిలిపివేయాల్సిందిగా ఆదేశించారు. అప్పటినుంచి ఎక్కడి పనులు అక్కడ నిల్చిపోయాయి. దాదాపు 50వేల కోట్ల అంచనాలతో కూడిన అభివృద్ధి పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. తర్వాత కొద్దిరోజులకే చంద్రబాబు నివాసానికి సమీపంలోని ప్రభుత్వానికి చెందిన ప్రజావేదికను కూల్చివేశారు. అక్కడ నుంచి అమరావతి విధ్వంసం ప్రారంభమైంది. దాని కోసం అనేక అబద్ధపు ప్రచారాలు తెరపైకి తెచ్చారు. అమరావతి అంటే కమ్మరావతి అని, అది కేవలం ఒక సామాజికవర్గానికి చెందినదని, రాజధాని పేరుతో చంద్రబాబు పెద్దఎత్తున ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని, అది ముంపు ప్రాంతమని, అక్కడ భవన నిర్మాణాలు ఖర్చుతో కూడిన పని అని, అమరావతిలో లక్షల కోట్లు వెచ్చించడం వల్ల మరలా హైదరాబాద్ తరహాలో అభివృద్ధి కేంద్రీకరణ జరిగి, ప్రాంతీయ వైషమ్యాలు తలెత్తే ప్రమాదముందని, అది శ్మశానమని, ఎడారి అని, అక్కడ రాజధాని కట్టడం వల్ల ఆహార భద్రతకు లోపం ఏర్పడుతుందని...ఇలా అనేక విధాలుగా దుష్ప్రచారం చేశారు. ఇంకోవైపు అభివృద్ధి వికేంద్రీకరణే తమ ప్రభుత్వ లక్ష్యమంటూ ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానులు అవసరమని 2019 డిసెంబర్ 17న సీఎం వైఎస్ జగన్ అసెంబ్లీలో ప్రకటన చేశారు. శాసన రాజధానిగా అమరావతి, కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నం, న్యాయరాజధానిగా కర్నూలును నిర్ణయించినట్లు ప్రకటించారు. అప్పటివరకు రాజధాని నిర్మాణపనులు నిలిపివేసినా, దానిపై అనేక దుష్ప్రచారాలు చేస్తున్నా

- మిగతా 2 లో

'అమరావతి నుంచి అరసవిల్లి'
## మహాపాద యాత్ర ప్రారంభం రేపు

2లో

### మూడు రాజధానుల పేరుతో
# ప్రజలను రెచ్చగొడితే సహించం

- రైతుల పాదయాత్రను అడ్డుకుంటే మూల్యం చెల్లించక తప్పదు
- లేపాక్షి భూములను దోచుకునేది జగన్ బంధువులే
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

**విశాలాంధ్ర-విజయవాడ:** మూడు రాజధానుల పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. విజయవాడ దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ మూడు రాజధానుల బిల్లును హైకోర్టు తీర్పునకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుందని, ఆ తదుపరి అమరావతి రాజధాని అభివృద్ధిపై హైకోర్టు తీర్పు తర్వాత వివాదం సమసిపోయిందని భావించామన్నారు. మళ్లీ ఇప్పుడు మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి ప్రజల మధ్య అంతరాలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని రామకృష్ణ విమర్శించారు. అమరావతి రైతులు చేపట్టదలచిన 'అమరావతి టు అరసవిల్లి' పాదయాత్రకు డీజీపీ అనుమతి నిరాకరిస్తే...

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

### యూపీ... బీహార్ చేతులు కలిపితే...
# మోదీ సర్కార్‌కు మూడినట్లే

- ఎస్‌పీ కార్యాలయం వద్ద వెలసిన బ్యానర్
- నితీశ్-అఖిలేశ్ చిత్రాలతో సంచలన సందేశం
- అఖిలేశ్, ములాయంతో భేటీ తర్వాత ఆసక్తికర పరిణామం
- బీజేపీకి వ్యతిరేకంగా విపక్ష ఐక్యతకు ముమ్మర యత్నాలు

**లక్నో:** దేశ రాజకీయాల్లో సంచలన మార్పులకు స్పష్టమైన సంకేతాలు వెలువడుతున్నాయి. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వినాశకర, విధ్వంసకర విధానాలు అమలు చేస్తున్న నరేంద్రమోదీ సర్కారును గద్దె దింపేందుకు ప్రతిపక్ష పార్టీలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఇప్పటికే బీహార్‌లో జేడీ(యూ) బీజేపీతో చెలిమికి చెల్లుచీటి ఇచ్చి...లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష పార్టీలతో జట్టుకట్టింది. ఆ పార్టీ అధినేత నితీశ్ కుమార్ బీజేపీకి వ్యతిరేకంగా దేశంలో ప్రత్యామ్నాయ కూటమి కోసం, ప్రతిపక్షాల ఐక్యతను బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సీపీఐ, సీపీఎం నాయకులు డి.రాజా, సీతారాం ఏచూరిని కలిసి చర్చించారు. అదే క్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, సమాజ్‌వాది పార్టీ నేతలు అఖిలేశ్ యాదవ్,

- మిగతా 2 లో

# బంగాళాఖాతంలో అల్పపీడనం

- మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం
- విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రజలకు ఇక్కట్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

8లో

# అరెస్టు చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవ్

## పాక్ ప్రభుత్వానికి ఇమ్రాన్ ఖాన్ హెచ్చరిక

**ఇస్లామాబాద్:** తనను అరెస్టు చేస్తే మరింత ప్రమాదకరంగా మారుతానంటూ పాకిస్తాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్ ఆ దేశ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తనపై ఉగ్రవాద కేసు విచారణ సమయంలో ఇస్లామాబాద్ హైకోర్టు వద్ద భారీస్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేయడంపై తీవ్ర అసహనాన్ని వ్యక్తంచేశారు. ఇస్లామాబాద్ సద్దార్ మెజిస్ట్రేట్ అలీ జావేద్ ఫిర్యాదు మేరకు ఇమ్రాన్‌పై ఉగ్రవాద కేసు నమోదు అయింది. ఆగస్టు 20న జరిగిన ర్యాలిలో మహిళా న్యాయమూర్తిని బెదిరిస్తూ.. వ్యాఖ్యలు చేయడంతో ఆయన న్యాయ చిక్కుల్లో పడ్డారు. వందలాది మంది భద్రతా సిబ్బంది మోహరించి ఉండగా ఇస్లామాబాద్ హైకోర్టుకు చేరుకున్న ఇమ్రాన్ మాట్లాడుతూ, 'నన్ను జైలుకు పంపిస్తే తీవ్ర పరిణామాలు తప్పవు' అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశం తిరోగమనంలో ఉందని దీనికి ఎన్నికలు ఒక్కటే పరిష్కారం అని ఇమ్రాన్ ఖాన్ అన్నారు. మహిళా న్యాయమూర్తిపై చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకోవచ్చన్నారు. ఈనెల 12 వరకు ఆయనకు గతంలో బెయిల్ ఇవ్వడం తెలిసిందే.

# వరుస భూకంపాలతో వణికిన ఇండోనేసియా

**జకార్త:** ఇండోనేషియా వరుస భూకంపాలతో శనివారం వణికిపోయింది. పాపువా ప్రాంతంలో 6.1 తీవ్రతతో భూమి కంపించింది. నిమిషాల వ్యవధిలో మరో భూకంపం సంభవించింది. రిక్టార్ స్కేలుపై దాని తీవ్రత 5.8గా నమోదైంది. అబెపురా పట్టణానికి 272 కిలోమీటర్ల దూరంలో, భూమికి 15కి.మీల లోతులో ఈ రెండు భూకంపాల కేంద్రాలు ఉన్నాయి. భూ ప్రకంపనలతో పలు ఇళ్లు ఊగిపోయాయి కానీ ప్రాణ-ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం లేదు. రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగా ఇండోనేసియాలో తరచూ భూకంపాలు సంభవిస్తూ ఉంటాయి. 2021లో సంభవించిన భూకంపానికి 100మందికిపైగా మరణించారు. 6.2 తీవ్రతతో వచ్చిన భూకంపం కారణంగా అనేక భవనాలు కుప్పకూలాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇటీవలే వరదల కారణంగా ఆ దేశంలోని అనేక ప్రాంతాలు నీటమునిగాయి. వరద నీరు ఇళ్లల్లోకి చేరి ప్రజలు ఇబ్బంది పడ్డారు. నిత్యావసరాలు కొనుగోలు కూడా కష్టంగా మారింది.

'అమరావతి నుంచి అరసవల్లి'

# మహా పాదయాత్ర ప్రారంభం రేపు

**విశాలాంధ్ర-విజయవాడ:** రాజధాని నిర్మాణం కోసం అమరావతి రైతులు తలపెట్టిన 'అమరావతి నుండి అరసవల్లి' మహాపాదయాత్ర 2.0 సోమవారం నుంచి ప్రారంభమవుతుందని అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ కన్వీనర్ ఎ.శివారెడ్డి తెలిపారు. ఈ మేరకు విజయవాడ ఆటోనగర్‌లోని జేఏసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం ఉదయం 5.30 నుంచి 6.10 గంటల మధ్య వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం పాదయాత్ర ప్రారంభమవుతుందని శివారెడ్డి చెప్పారు. పాదయాత్ర జరిగితే ఉత్తరాంధ్ర ప్రజలు రాళ్లు వేస్తారని మంత్రులు చెప్పటాన్ని ఆయన ఖండించారు. గతంలో న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు మహాపాద యాత్ర చేసిన సందర్భంలో రాయలసీమ ప్రజలు రాళ్లు వేస్తారని చెప్పారని, కానీ అమరావతి రైతులపై వారు పూలవర్షం కురిపించారని గుర్తుచేశారు. సెప్టెంబరు 12 నుంచి నవంబరు 11వ తేదీ వరకు దాదాపు వెయ్యి కిలోమీటర్లు పాదయాత్ర సాగుతుందన్నారు. అరసవల్లి వద్ద ముగింపు సందర్భంగా బహిరంగ సభ నిర్వహణకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. రాజధాని జేఏసీ సమన్వయ కమిటీ సభ్యులు కల్లం రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పాదయాత్రను దండయాత్రతో పోల్చటం దుర్మార్గమన్నారు. జగన్ పాదయాత్ర కూడా దండయాత్రేనా? అని ప్రశ్నించారు. ఓట్లు వేసి ముఖ్యమంత్రిని చేసిన అమరావతి ప్రజల్ని అవమానిస్తూ అమరావతి దెయ్యాల రాజధాని అని వ్యాఖ్యానించటాన్ని ఖండించారు. తమ రెండో విడత పాదయాత్రకు మద్దతు ప్రకటించిన అన్ని రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. గౌరనేని స్వరాజ్య రావు మాట్లాడుతూ ఉద్యమ స్వరూపం ప్రభుత్వాన్ని భయపెడుతుందన్నారు. గోదావరి లాంచి ప్రమాదం, ఉత్తరాంధ్రలో నష్టం కలిగించినప్పుడు, వరదలు వస్తున్న సందర్భంలో మాట్లాడని మంత్రులు...ఇప్పుడెందుకు స్పందిస్తున్నారని ప్రశ్నించారు. పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ అమరావతి అభివృద్ధి 29 గ్రామాల ప్రజలది మాత్రమే కాదన్నారు. మూడు సంవత్సరాలు ప్రజల్ని మభ్యపెట్టారని చెప్పారు. ఆకుల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాజధాని సమస్య రాష్ట్ర ప్రజలదని రాయలసీమ వారికి వివరించామని, ఇప్పుడు ఉత్తరాంధ్ర ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. ఉక్కు ఉద్యమానికి రైతులు మద్దతిచ్చారని గుర్తు చేశారు. విశాఖ ప్రజలు తమకు రాజధాని వద్దంటున్నారని తెలిపారు. జీబీ తిరుపతిరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి భజనపరులే పాదయాత్రకు అడ్డుపడుతున్నారన్నారు. పాదయాత్ర సజావుగా సాగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# సీపీసీపై రెండు నెలల్లో నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రొఫెసర్ వరకు అన్నిస్థాయిల్లో బోధనా సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తామన్నారు. డిసెంబరులోగా విద్యాశాఖలో పదోన్నతులు పూర్తిచేస్తామన్నారు. రాష్ట్రంలో 25 వేలమంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని, కోర్టు నిబంధనల మేరకు అర్హులైన వారందరినీ క్రమబద్ధీకరిస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే స్పష్టం చేశారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై నెలరోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు కొత్త పీఆర్‌సీ ప్రకారం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జీతాలు చెల్లిస్తామని మంత్రి వెల్లడించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని 1.72 లక్షల మంది ఉద్యోగులు తమ సంఘంలో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. వైద్య, ఆరోగ్యశాఖలో ఉద్యోగులు యాప్‌ల వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు, కార్యదర్శి కంది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సర్కార్‌కు మూడినట్లే

(మొదటిపేజీ తరువాయి)

ములాయం సింగ్ యాదవ్‌తో సమావేశమయ్యారు. అఖిలేశ్, ములాయంతో భేటీ అయిన కొద్ది రోజులకే ఉత్తరప్రదేశ్‌లోని సమాజ్‌వాది పార్టీ కార్యాలయం వద్ద ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. నితీశ్, అఖిలేశ్ యాదవ్ అభివాదం చేస్తున్న చిత్రాలతో బ్యానర్ వెలసింది. దీనిపై 'యూపీ+బీహార్=గయా మోదీ సర్కార్ (ఉత్తరప్రదేశ్+బీహార్ చేతులు కలిపితే, మోదీ ప్రభుత్వం గద్దె దింపబడుతుంది' అని సందేశం ఉంది. ఈ తాజా పరిణామం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. నలుపు, తెలుపు రంగుల బ్యానర్‌లో నితీశ్ కుమార్ ఆకుపచ్చ కండువా, అఖిలేశ్ ఎరుపు టోపీ ధరించి ఉన్నారు. ఈ రెండూ తమ పార్టీలు ఇష్టపడే రంగు ఎంపికను సూచిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్ కలిసి 120 (వరుసగా 80... 40) మంది ఎంపీలను లోక్‌సభకు పంపాయి. ఈ రెండు రాష్ట్రాల్లో మెరుగైన పనితీరు కనబరిచే పార్టీ లేదా రాజకీయ నిర్మాణం దిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మంచి స్థితిలో ఉంటాయి. దేశ రాజకీయాల గమనాన్ని మార్చే సంఘ టనలను ప్రారంభించిన చరిత్ర ఉత్తరప్రదేశ్, బీహార్‌లకు ఉన్నాయని శనివారం ఈ బ్యానర్ ఏర్పాటు వెనుక ఉన్న సమాజ్ వాదీ పార్టీ నాయకుడు ఐపీ సింగ్ అన్నారు. 'ఈ రాష్ట్రాలు (మార్పు కోసం) నిర్ణయించుకుంటే (ఇతరులకు) ఏమీ మిగలదు. రాజకీయ మ్యాప్ చూస్తే బీజేపీ ఎక్కడా ఉండదు' అని పీటీఐకి చెప్పారు. ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ, ఇతర ప్రతిపక్ష పార్టీలు... నితీశ్ కుమార్ బీహార్‌లో బీజేపీని పడగొట్టడం, అక్కడ తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆర్‌జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో చేతులు కలపడాన్ని స్వాగతించాయి. దేశ రాజధానిలో ఎస్పీ, జేడీ(యూ) అధినేతల మధ్య జరిగిన సమావేశం తర్వాత ఈ బ్యానర్ లక్నో రాజకీయ వర్గాల్లో ఊహాగానాలకు తెరతీసింది. సమాజ్‌వాదీ పార్టీ, జనతాదళ్ (యునైటెడ్), రాష్ట్రీయ జనతాదళ్, రాష్ట్రీయ లోక్‌దళ్ సోషలిస్టు భావజాలానికి ఆద్యులని, వారందరికీ 'నేతాజీ' ములాయం సింగ్ యాదవ్ 'పోషకుడు' అని ఎస్పీ అధికార ప్రతినిధి ఐపీ సింగ్ అన్నారు. 'ఇంతకుముందు నియంతృత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించిన సమాజ్ వాదీలు, రాబోయే రోజుల్లో సోషలిస్టులు విప్లవ వీరులు అవుతారు' అని ఆయన తెలిపారు. అఖిలేశ్, ములాయం సింగ్‌తో పాటు రాహుల్ గాంధీ, ఐఎన్ఎల్‌డీ అధినేత ఓపీ చౌతాలా, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్‌ను కూడా నితీశ్ కుమార్ కలిశారు. ఆ సందర్భంగా నితీశ్ మీడియాతో మాట్లాడుతూ తాము 'థర్డ్ ఫ్రంట్'ను ఏర్పాటు చేయడం లేదని, ఇదే 'మెయిన్ ఫ్రంట్' అవుతుందని చెప్పారు.

ఇదిలాఉండగా, సమాజ్‌వాదీ పార్టీ ఓటర్ల మద్దతు కోల్పోతోందని బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి శనివారం అన్నారు. 'యూపీలో ఎస్పీ తన మద్దతును కోల్పోతోంది. ఇందుకు దాని స్వయంకృతా పరాధమే ప్రధాన కారణం. కుటుంబం, పార్టీలో కలహాలు, నేరపూరిత అంశాలతో సంబంధాలపై పెద్ద ఎత్తున ప్రచారం జరగడం కూడా కారణం' అని పేర్కొంటూ హిందీలో ట్వీట్ చేశారు. బీజేపీ నేత, యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య కూడా ఎస్పీపై మండిపడ్డారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో బీజేపీ 62 సీట్లు గెలుచు కోగా, దాని మిత్రపక్షం అప్నా దళ్ (సోనెలా) రెండు సీట్లు గెలుచుకుంది. బీఎస్పీ 10, ఎస్పీ 5, కాంగ్రెస్ ఒక స్థానంలో గెలుపొందాయి. ఇటీ వల జరిగిన ఉప ఎన్నికల్లో అజంగఢ్, రాంపూర్ స్థానాలను బీజేపీ గెలుచుకుంది. దీంతో వాటి సంఖ్య 64కి, ఎన్‌డీఏ బలం 66కి చేరుకుంది. అయితే బీహార్‌లో అప్పటి బీజేపీ, జేడీ(యూ), ఎల్‌జేపీ కలయికతో కూడిన ఎన్‌డీఏ 2019లో మొత్తం 40 సీట్లకుగాను 39 స్థానాలను గెలుచుకున్నాయి. వీటిలో బీజేపీ వాటా 17 సీట్లు కాగా, జేడీ(యూ) 16, కేంద్ర మాజీ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్‌కి చెందిన లోక్ జనశక్తి పార్టీకి ఆరు సీట్లు ఉన్నాయి. జేడీ(యూ) కూటమిని వీడటంతో ఎన్‌డీఏ బలం 23 సీట్లకే పరిమితమయింది. ఇక కాంగ్రెస్ బీహార్‌లో ఒకే ఒక సీట్లు కలిగి ఉండగా, ఆర్‌జేడీకి సీటే లేదు. ఏదిఏమైనా దేశంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలు ప్రతిపక్షాల ఐక్యతకు మరింత ఊతమిచ్చి, కేంద్రంలోని కాషాయ పాలకుల భవిష్యత్తు అధికార ఆశలకు గండికొట్టడం ఖాయమనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

# పాకిస్తాన్‌కు 18 బిలియన్ డాలర్ల నష్టం

## వరదలతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థం

**ఇస్లామాబాద్ :** పాకిస్తాన్‌ను వరదలు ముంచెత్తాయి. దాయాది దేశంలో తీవ్రస్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. భారీ వర్షాలు, వరదలతో పాటు ఉక్రెయిన్-రష్యా యుద్ధ పరిస్థితుల క్రమంలో పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నది. వరదల వల్ల 18 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్లు నివేదికలు చెబుతున్నాయి. వ్యవసాయ వృద్ధి తీవ్రంగా దెబ్బతిన్నదని, 8.25 మిలియన్ ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని న్యూస్ ఇంటర్నేషనల్ నివేదించింది. పత్తి, బియ్యం, చిన్న పంటలు పూర్తిగా నీటమునిగినట్లు తెలిపింది. తాజా పరిస్థితులు గోధుమ సాగుకూ అనుకూలంగా లేవని వెల్లడించింది. పాకిస్తాన్‌ను ఆదుకోవాలని ఆ దేశ అధికారులు అంతర్జాతీయ దాతలను అభ్యర్థిస్తున్నారు. వచ్చే ప్రతి రూపాయిని ఆచితూచి పాకిస్తాన్ వినియోగిస్తుందని, పైసా కూడా వృథా కాబోదని హామీనిస్తున్నట్లు వార్తానివేదిక తెలిపింది. జీడీపీ వృద్ధి తగ్గడంతో ఆదాయం నత్తనడకన సాగుతోంది. దేశ ఆర్థిక వృద్ధి గణనీయంగా తగ్గుతుందని అంచనా వేస్తున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి దాని జీడీపీ వృద్ధి రేటును ఐదు శాతం నుంచి మూడు శాతానికి తగ్గించాల్సి వస్తుందని నివేదికలు పేర్కొన్నాయి. నేషనల్ ఫ్లడ్ రెస్పాన్స్ అండ్ కోఆర్డినేషన్ సెంటర్ మేజర్ జనరల్ జాఫర్ ఇక్బాల్, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెర్రస్‌లకు అధికారులు దేశ పరిస్థితిని వివరించారు. గుటెర్రస్ ప్రస్తుతం పాకిస్తాన్ పర్యటనలో ఉన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ యంత్రాంగం నివేదిక ప్రకారం, వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 1,396కు చేరుకుంది. గాయపడిన వారి సంఖ్య 12,700 పైగా ఉంది. అనేక మంది గల్లంతయ్యారు. 1.7 మిలియన్లకు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. 6,600 కిమీలకుపైగా రోడ్లు, 269 వంతెనలు దెబ్బతిన్నాయి. 81 జిల్లాలను బాధిత జిల్లాలుగా పేర్కొన్నారు. గుటెర్రస్ సింధ్, బలూచిస్తాన్ ప్రావిన్సులలోని వరద బాధిత ప్రాంతాలను సందర్శించి; సహాయ, పునరావాస చర్యలతో పాటు వరద నష్టాలను సమీక్షిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. వరదల కారణంగా పాకిస్తాన్‌లోని 118 జిల్లాల్లో 37శాతం జనాభా జనజీవనం అస్తవ్యస్తంకాగా పేదలు, నిరుద్యోగులు 21.9శాతం నుంచి 36శాతానికిపైగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు పాక్ ప్రభుత్వ అంచనాల ద్వారావెల్లడి అయింది.

# కాలిఫోర్నియాలో కార్చిచ్చు

## 3600 ఇళ్లు దగ్ధం

**కాలిఫోర్నియా:** కాలిఫోర్నియా అడవులను కార్చిచ్చు కకావికలం చేసింది. ఈ మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక దళసభ్యులు తీవ్రంగా శ్రమించారు. ఉత్తరాన ఉన్న సియర్రా నెవేడలో మంటలు వ్యాపించాయి. అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. రాష్ట్రానికి రెండు వైపులా ఉన్న కొండ ప్రాంతాల్లో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 20 చదరపు మైళ్ల మేర అగ్నికి ఆహుతి కాగా 3600 ఇళ్లు దగ్దం అయ్యాయి. ఎల్ డొరాడో కౌంటీస్‌పై పొగ దుప్పటి కమ్మేసింది. 24 గంటల్లో మంటలు మూడు రేట్లు పెరిగినట్లు అధికారులు చెప్పారు. దాదాపు 1100 మంది అగ్నిమాపక సిబ్బంది శకటాలు, విమానాల ద్వారా మంటలను ఆర్పే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఈ కార్చిచ్చులో భారీగా ప్రాణనష్టం జరిగినట్లు వెల్లడించారు. చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు.

# అమరావతి ఉద్యమం @ 1000

(మొదటిపేజీ తరువాయి)

ఎంతో సహనంతో భరించిన రైతులు, మూడు రాజధానుల ప్రకటనతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ విధంగా ప్రారంభమైన రైతుల ఉద్యమం వెయ్యి రోజులకు చేరువైంది. 2019 డిసెంబరు 20న రాజధాని గ్రామాల్లో రిలేదీక్షలు ప్రారంభించగా, అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మరోపక్క అనేక రూపాల్లో పోరు కొనసాగిస్తున్నారు. మహిళలు ఈ పోరాటంలో పెద్దసంఖ్యలో పాల్గొనడం ఈ ఉద్యమానికున్న ప్రత్యేకత. ఉద్యమాన్ని అణచడానికి ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. ఈ ప్రస్తానంలో రైతులపై వేలాది అక్రమ కేసులు బనాయించారు. లాఠీలతో విచక్షణా రహితంగా కొట్టారు. పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించారు. ఎస్సీలపైనే అత్యాచార నిరోధక చట్టాన్ని ప్రయోగించారు. అయినా రైతులు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఒకపక్క ప్రభుత్వ దమనకాండ కొనసాగుతుండగానే మరోపక్క కరోనా మహమ్మారి దాపురించి వీరికి అగ్నిపరీక్ష పెట్టింది. అయినప్పటికీ రైతులు, మహిళలు వెనక్కి తగ్గలేదు. ఎవరి ఇళ్లలో వారు నిరసన దీక్షలు చేపట్టారు. సంవత్సరాల తరబడి రైతులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం కనీసం వారితో సంప్రదింపులు జరిపే ప్రయత్నం చేయలేదు. వారికి న్యాయం చేస్తామని చెప్పడమే తప్ప ఏరకంగా చేస్తారో చెప్పడం కాని, ఆ దిశగా ఆలోచన చేసిన దాఖలా కనిపించ లేదు. దీంతో ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ప్రజలందరికీ ప్రభుత్వ కుట్రలు తెలియజెప్పాలన్న ధ్యేయంతో రైతులు గత ఏడాది చరిత్రాత్మకమైన 'న్యాయస్థానం టూ దేవస్థానం' పేరిట హైకోర్టు నుంచి తిరుపతికి పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర 2021 నవంబరు 1 నుంచి డిసెంబరు 17 వరకూ కొనసాగింది. మొత్తం 4 జిల్లాల మీదుగా సాగిన ఈ యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. చివరకు వైసీపీ నేతలు సైతం ఆంతరంగికంగా వారికి మద్దతు తెలియజేయడం విశేషం. ఈ యాత్ర ముగియక ముందే ముఖ్యమంత్రి మడమ తిప్పారు. మూడు రాజధానుల నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడంతోపాటు అదేరోజు అసెంబ్లీలో బిల్లు పెట్టి ఉపసంహరించుకున్నారు. సమస్య పరిష్కారమైందని అందరూ సంబరపడే లోపే, మళ్లీ మూడు రాజధానుల ఏర్పాటుకు సమగ్ర బిల్లు తెస్తామని ప్రకటించారు. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. హైకోర్టు 6 నెలల్లో రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించినప్పటికీ తమ దగ్గర అంత డబ్బుల్లేవంటూ కాలయాపన చేస్తోంది. కోర్టు తీర్పు ప్రకారం గడువు ముగిసినా ప్రభుత్వం మాత్రం ఇటుక ముక్క కూడా కొత్తగా పెట్టలేదు. ఈ క్రమంలోనే రైతులు, మహిళలు చేస్తున్న ఉద్యమం సెప్టెంబరు 12కి వెయ్యి రోజులకు చేరుకుంటున్న సందర్భంగా మహా పాదయాత్ర చేపడుతున్నారు. దీనికి కూడా అనుమతి ఇవ్వ కుండా, పాదయాత్ర వల్ల శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తూ ప్రాంతీయ వైషమ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. హైకోర్టు రైతుల పాదయాత్రకు అనుమతి ఇస్తూ తీర్పు చెప్పింది. గతంలో తిరుపతి యాత్రకు కూడా హైకోర్టే అనుమతి ఇచ్చింది. మహాపాదయాత్రలో పాల్గొనేవారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని తేల్చి చెప్పింది. మొత్తం 600మంది రైతులు పాదయాత్రలో పాల్గొనేందుకు అనుమతించింది. సెప్టెంబరు 12న అమరావతిలో పాదయాత్ర మొదలై నవంబరు 11న శ్రీకాకుళం జిల్లా అరసవెల్లిలో ముగుస్తుంది. మొత్తం 60 రోజులపాటు కొనసాగుతుంది. ఈ నెల 12న వేకువజామున 5 గంటలకు వెంకటపాలెంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు పూర్తయిన అనంతరం రథానికి జెండా ఊపి యాత్ర ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని తప్ప మిగతా పార్టీలన్నింటినీ ఆహ్వానించారు. గతంలో అమరావతినే ఏకైక రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రైతులు పాదయాత్ర నిర్వహించగా, ప్రస్తుతం హైకోర్టు తీర్పుకనుగుణంగా రాజధాని నిర్మాణపనులు తక్షణమే ప్రారంభించాలనే డిమాండ్‌తో పాదయాత్ర చేపడుతున్నారు.

# ప్రజలను రెచ్చగొడితే సహించం

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టుకు వెళ్లి అనుమతి తెచుకున్నారని గుర్తుచేశారు. రాజ్యాంగం మన రాష్ట్రానికి వర్తించదా? పాదయాత్ర చేసుకోనివ్వరా? ధర్నాలు చేయకూడదు... ర్యాలీలు చేయకూడదంటూ నిర్బంధాలేమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. విశాఖ పట్నం అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఉత్తరాంధ్ర మంత్రులతో మాట్లాడించటం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. విశాఖ ఒక్కరోజులో అభివృద్ధి కాలేదని, విశాఖ చేపలు పట్టుకునే చిన్న గ్రామమని, అక్కడ స్టీల్‌ప్లాంట్, పోర్టు, ఇతర ప్రభుత్వ సంస్థలు ఏర్పాటు చేయటం వల్ల అభివృద్ధి చెందిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటును కేంద్రం ప్రైవేటీకరిస్తుంటే ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడలేకపోతున్నారని రామకృష్ణ ప్రశ్నించారు. అదానీ ఇస్తున్న కమీషన్లకు కక్కుర్తిపడి గంగవరం పోర్టు వేలకోట్ల ఆస్తిని ఆయనకు కట్టబెట్టారని విమర్శించారు. విశాఖ అభివృద్ధికి అడ్డుగా ఉన్నారని మంత్రుల ద్వారా, ఎమ్మెల్యేల ద్వారా మాట్లాడించటం మానుకోవాలన్నారు. రైతుల పాదయాత్రకు ఏదైనా ఆటంకం జరిగితే దానికి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందాలని వైసీపీ చూస్తున్నదన్నారు. కపడ జిల్లాలో స్టీల్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి...అభివృద్ధి చేస్తే వద్దనేవాళ్లు ఎవరూ లేరన్నారు. గండికోట ప్రాజెక్టుకు ఒక్క కాలువ తవ్వలేదన్నారు. అభివృద్ధి చెందిన విశాఖపట్నం ప్రాంతాన్ని వైసీపీ నాయకులే దోచుకుంటున్నారని విమర్శించారు. తన కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు వస్తే మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని సీఎం జగన్ నిలదీయటం సిగ్గుచేటన్నారు. జగన్ దోపిడీ గురించి మంత్రులు మాట్లాడతారా? అని ప్రశ్నించారు. ఏమి మాట్లాడాలో కూడా మంత్రులకు చీటి రాసిస్తున్నారని చెప్పారు. మద్యపాన నిషేధమని ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన జగన్...సొంత బ్రాండ్లు అమ్మి వేలకోట్ల రూపాయలు దోచుకుంటున్న దానికి సమాధానమేమిటని ప్రశ్నించారు. మద్యంపై డబ్బులు సంపాదిస్తున్న సీఎం ప్రపంచంలో జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని అన్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో లేపాక్షి నాలెడ్జి హబ్ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. కడప-బెంగళూరు జాతీయ రహదారి ప్రక్కన గల 8వేల ఎకరాల భూములను దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. లేపాక్షి భూముల్ని తీసుకుని, వాటిని బ్యాంకులో తనఖా పెట్టి దివాలా పిటిషన్ వేయించేలా చేసేది మీరేనని సీఎం జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్ మేనమామ కొడుకు రామాంజనేయరెడ్డి లేపాక్షి భూముల్ని కొంటున్నారని తెలిపారు. మంత్రి అంజాద్ బాషాని లేపాక్షి భూములపై మాట్లాడమని చెపితే ఆయన ఏమి చేస్తారన్నారు. రామాంజనేయరెడ్డి జగన్ మేనమామ కొడుకు కాదని చెబుతారా? అని ప్రశ్నించారు. లేపాక్షి భూములపై సీఎం పేషీలో లీగల్ రికార్డు ఉందా? అని అనుమానం వ్యక్తం చేశారు. నిబంధ నలకు విరుద్ధంగా భూములను దోచుకుంటున్నారని మండి పడ్డారు. 2013 భూ సమీకరణ చట్టం ప్రకారం తీసుకున్న భూములను అభివృద్ధి చేయకపోతే వెనక్కు ఇచ్చేయాలన్నారు. లేపాక్షి భూములపై సీపీఐ అధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అమరావతి రైతుల పాదయాత్రకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. రైతులతో కలిసి నడుస్తామన్నారు. పాదయాత్రకు ప్రభుత్వం అన్ని రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అరాచకాలు సృష్టించాలని ప్రయత్నిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# 15 నుంచి అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించాలని భావించినప్పటికీ, దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు 24 నుంచి ప్రారంభం కానుండటంతో దీనికి ముందుగానే ముగించా లని నిర్ణయించారు. ఈ సమావేశాల్లో మూడు రాజధానులకు సంబంధించిన బిల్లును సభలో ప్రవేశపెట్టే దిశగా వైసీపీ సర్కారు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఆ విషయాన్ని బహిరంగంగానే మంత్రి అమర్‌నాథ్ ప్రకటించారు. దాంతోపాటు అనేక కీలక బిల్లులను కూడా ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. అమరావతి రాజధాని ఉద్యమం వెయ్యి రోజులకు చేరుతున్న సందర్భంగా రైతులు ఈనెల 12 నుంచి అమరావతి-అరసవిల్లి మహా పాదయాత్ర చేపడుతున్నారు. ఈ పాదయాత్రకు కౌంటర్‌గా అసెంబ్లీలో మరలా మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టి, మరోసారి చర్చ పెట్టడం ద్వారా ప్రజలను తమ వైపు మరల్చుకునే యోచనలో ఉంది. ఇందుకోసం సమావేశాలను మరికొన్ని రోజులు పొడిగించినా ఆశ్చర్యం లేదని అంటున్నారు.

# కొత్తశకం

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలోనే భావోద్వేగానికి గురయ్యారు. తల్లిని గుర్తుచేసుకున్నారు. ఆమె అడుగుజాడల్లో నడుస్తానన్నారు. తన జీవితమంతా ప్రజల కోసమే ఆలోచించారని తెలిపారు. తల్లి ఎలిజబెత్-2కు నివాళులు అర్పించారు. మా అమ్మే నాకు ప్రేరణ అని భావోద్వేగానికి గురయ్యారు. ఆమె మరణం కలిచివేసిందని అన్నారు. తన బాటే అనుసరిస్తానని, ప్రజల కోసం తుది శ్వాస వరకు అంకిత భావంతో పనిచేస్తానని తన తొలి ప్రసంగంలో కింగ్ చార్లెస్ అన్నారు. రాజుగా తన బాధ్యతలు తెలుసు అని వాటిని నిబద్ధతతో నిర్వర్తిస్తానని చెప్పారు. ఇలాంటి కష్ట సమయంలో రాణి పట్ల ప్రజలు చూపిన ప్రేమకు, తమకు అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కామన్వెల్త్ దేశాధినేతలకు, ప్రపంచవ్యాప్తంగా సంతాప సందేశాలు పంపిన దేశాధినేతలకూ ధన్యవాదాలు చెప్పారు. రాచరికాన్ని వదులుకున్న తన రెండో కుమారుడు హ్యారీ గురించీ చార్లెస్ ప్రస్తావించారు. హ్యారీ, ఆయన సతీమణి మేఘన్‌పై తనకు ఎంతో ప్రేమ ఉందని, విదేశాల్లో వారి జీవితం హాయిగా కొనసాగాలని కొత్త రాజు ఆకాంక్షించారు. తన తల్లి చిత్రపటాన్ని పక్కనే పెట్టుకుని చార్లెస్ తొలి ప్రసంగం చేశారు. 'ఆమె ఆప్యాయత, అభిమానం మనకు మార్గదర్శకంగా నిలిచాయి. తన జీవితం చిన్నదైనా, పెద్దదైనా.. అది ఈ దేశానికే అంకితం చేస్తాను. 21 ఏళ్లలోనే రాణి ప్రతిజ్ఞ చేశారు. అది కేవలం ప్రతిజ్ఞ మాత్రమే కాదు.. వ్యక్తిగత నిబద్ధత. ఆమె జీవితంలో అది స్పష్టంగా ప్రతిబింబించింది. రాచరికపు విధుల కోసం ఆమె ఎన్నో త్యాగాలు చేశారు. ఆమె గొప్ప వారసత్వాన్ని కొనసాగించే బాధ్యత నాపై ఉంది. ఈ బాధ్యతతో నా జీవితంలో ఎన్నో మార్పులు వస్తాయని తెలుసు. నా తల్లి ప్రతిజ్ఞను కొనసాగిస్తూ దేశ సేవకే అంకితమవుతానని మాటిస్తున్నా. నా ప్రియమైన తల్లికి నేను చెప్పాలనుకునేది ఒకటే.. థ్యాంక్యూ' అని కింగ్ ఛార్లెస్ భావోద్వేగంగా మాట్లాడారు.

**ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌గా విలియం..**

చార్లెస్ రాజుగా బాధ్యతలు చేపట్టనుండటంతో ఆయన పెద్ద కుమారుడు విలియం యువరాజు అయ్యారు. దీంతో ఇకపై ఆయనను ప్రిన్స్ ఆఫ్ వేల్స్, విలియం సతీమణి కేట్ మిడిల్టన్‌ను ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు కింగ్ ఛార్లెస్ తన ప్రసంగంలో అధికారికంగా ప్రకటించారు. ఛార్లెస్ తన జీవితంలో ఎక్కువ కాలం వేల్స్ యువరాజుగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఆయన మొదటి భార్య డయానా ఇప్పటివరకు ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్‌గా ఉన్నారు. డయానా మరణానంతరం ఛార్లెస్ కెమిల్లాను వివాహం చేసుకున్నప్పటికీ.. వేల్స్ యువరాణి హోదాను మాత్రం ఆమె స్వీకరించలేదు. డయానా గౌరవార్థం అలాగే కొనసాగించారు. ఇప్పుడు ఆ హోదా కేట్‌కు దక్కింది. కాగా, హ్యారీ దంపతులు రాచరికాన్ని వదులుకున్నప్పటికీ వారి కుమారుడు అర్చి మౌంట్‌బాటన్-విండ్సర్ సాంకేతికంగా కొత్త ప్రిన్స్‌గా, ఆయన సోదరి లిలిబెట్ ప్రిన్సెస్‌గా అవతరించారని స్థానిక మీడియా పేర్కొంది. ఏడు దశాబ్దాలకుపైగా బ్రిటన్‌ను పాలించిన ఎలిజబెత్-2 స్కాట్లాండ్‌లోని తన వేసవి విడిది బల్మోరల్ క్యాజిల్‌లో గురువారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. రాజ కుటుంబం సంతాప కాల వ్యవధి నెల రోజులు ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే యూకే ప్రభుత్వం 10 రోజుల అధికారిక సంతాప దినాలను ప్రకటించింది.

## కరెన్సీ-నాణెల్లో మార్పు

11 శతాబ్దాలుగా బ్రిటన్‌లో రాయల్ మింట్ కరెన్సీని విడుదల చేస్తోంది. చక్రవర్తి ముఖచిత్రాలతో నాణెలు, కరెన్సీ నోట్లను ముద్రిస్తోంది. 1952లో రాణిగా ఎలిజబెత్ 2 పట్టాభిషేకం తర్వాత బ్రిటన్, కామన్వెల్త్ దేశాల్లో ఆమె బొమ్మతో రూపొందించిన నాణేలు, కరెన్సీ నోట్లు విడుదల చేశారు. ప్రతి పదేళ్లకు ఆమె గౌరవార్థం కొత్త నాణెలను రూపొందిస్తారు. బ్రిటన్ రాజుగా చార్లెస్ 3 సింహాసనాన్నీ అధీష్టించడటంతో కరెన్సీలో మార్పులు జరగనున్నాయి. ఆయన ఫొటోతో నాణెలు, కరెన్సీ నోట్లను ముద్రించనున్నారు. కరెన్సీపై రాణి ఎలిజబెత్ చిత్రం కుడివైపున.. కొత్తగా ముద్రించే నోట్లపై ఛార్లెస్ చిత్రం ఎడమవైపున ఉండనుంది. కరెన్సీ నోట్లపై రాణి లేదా రాజు చిత్రాలు అంతకుముందు పాలించిన వారికి అభిముఖంగా ఉండటం గత 300 ఏళ్లుగా వస్తోన్న సంప్రదాయం. 1956 నుంచి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ విడుదల చేసే కరెన్సీ నోట్లపైనా రాణి ఎలిజబెత్ చిత్రాలను ముద్రిస్తున్నారు.

## ఎలిజబెత్-2 అంత్యక్రియలకు బైడెన్..

రాణి ఎలిజబెత్-2 అంత్యక్రియలకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హాజరుకానున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. రాణి అంత్యక్రియలు ఈనెల 19న సెంట్రల్ లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ అబ్బేలో జరుగుతాయని బకింగ్‌హామ్ వర్గాలు తెలిపాయి. అప్పటివరకు రాణి భౌతిక కాయాన్ని ప్రజలు, ప్రపంచ దేశాల నాయకులు సందర్శనకు ఉంచనున్నారు. కింగ్ జార్జ్ 4 మెమోరియల్ చాపెల్‌లో క్వీన్ ఎలిజబెత్ 2ను శవపేటికను, ఆమె భర్త, ప్రిన్స్ ఫిలిప్ పక్కన ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. విండ్సన్ కాజిల్‌లో ప్రభుత్వ లాంఛనాలతో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టాక అంత్యక్రియలు జరుగుతాయని ప్యాలెస్ వర్గాల సమాచారం.

## యూనిఫాం కుట్టు కూలీలు రూ.61 కోట్లు జమ

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** జగనన్న విద్యాకానుకలో భాగంగా 2021-22 విద్యా సంవత్సరానికిగాను విద్యార్థులకు ఇచ్చిన 3 జతల యూనిఫాం క్లాత్ కుట్టు కూలీ కోసం 43,06,032 మంది తల్లుల ఖాతాల్లో రూ.61,72,82,160 శుక్రవారం జమ చేసినట్లు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 3 జతల కుట్టు కూలీకిగాను రూ.120, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు రూ.240 చొప్పున ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న విద్యాకానుక పథకం కింద ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థికి ఉచితంగా 3 జతల యూనిఫాం క్లాత్, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, పిక్టోరియల్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీతో పాటు బ్యాగు కిట్‌గా అందించామని తెలిపారు.

# సంపూర్ణ స్వాతంత్ర్యం కోరింది కమ్యూనిస్టులే

### సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

**విశాలాంధ్ర-తిరుపతి:** మర్రి బీజం చిన్నదే అయినా అది మహా వృక్షంలా ఎదిగినట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కూడా గొప్పగా పెరుగుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతి బైరాగి పట్టెడలోని సీపీఐ కార్యాలయంలో రెండవ రోజు జిల్లా వర్క్ షాప్ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నారాయణ మాట్లాడుతూ ఈ వర్క్ షాప్‌ను చూసిన తరువాత జాతీయ మహాసభలు విజయవంతంగా జరుగుతాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య పోరాటానికి ముందే పుట్టినప్పటికీ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని కోరింది మాత్రం ఒక్క కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. మీరంతా ఎందుకు సీపీఐలో పని చేయాలనుకుంటున్నారని, పార్టీలో కష్టాలు తప్ప... ఉద్యోగాలు ఇవ్వరని, అయినా మీరు ఎర్ర జెండా పట్టుకుని పోరాటం చేస్తున్నారని అభినందించారు. భారతదేశాన్ని నడిపించడానికి ఒక రాజకీయ వ్యవస్థ ఉండాలని ఆయన సూచించారు. ఆర్ఎస్ఎస్ పుట్టుక మతంతో అని, అందులో ప్రధానంగా హిందుత్వ అనే పదంతో ఫ్యూడల్, భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థలు పుట్టుకొచ్చాయని తెలిపారు. దేశంలో అందరికీ భూమి సహజ సిద్ధంగా రాలేదని, దున్నే వానికి భూమి కావాలని సీపీఐ పోరాడి భూసంస్కరణలు తీసుకువచ్చి పేద ప్రజలకు భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదేనని తెలిపారు. నిజాం నవాబు లక్షల ఎకరాల భూమిని పేదలకు దక్కకుండా చేశారని అన్నారు. పరిశ్రమలు ప్రభుత్వ ఆస్తులుగా ఉండాలన్నారు. రాజకీయాలలో చాలా మార్పు వచ్చిందని, ఇప్పుడు మతాన్ని రెచ్చగొడితే ఓట్లు వస్తాయని, అలాగే యూపీ, బీహార్ లాంటి రాష్ట్రాలలో కులాల పేరుతో పార్టీలు వచ్చాయని చెప్పారు. డబ్బు, కులం, మతం రాజకీయాలను శాసిస్తున్నాయని అన్నారు. ఇప్పుడు రౌడీలే రాజకీయాలలో ఉండటం చాలా బాధాకరమని అన్నారు.

మనం ప్రజలతో ఉంటూ, పేదలతో జీవిస్తూ వారి కోసం పోరాడటమే కర్తవ్యంగా ఉండాలని సూచించారు. ఈ రెండు రోజుల వర్క్ షాప్‌ను జయప్రదం చేసినందుకు అభినందనలు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ సీపీఐ జాతీయ మహాసభలకు జిల్లా నుంచి రైళ్లు, బస్సులు ఇతర వాహనాల్లో పెద్ద సంఖ్యలో తరలి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, జె.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధన, ఆవిష్కరణలు అవశ్యం

### శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆధునిక విధానాలు రూపొందించాలి

### రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాని మోదీ పిలుపు

**న్యూఢిల్లీ:** భారతదేశాన్ని పరిశోధన, ఆవిష్కరణలకు అంతర్జాతీయ కేంద్రంగా మార్చేందుకు సమష్టి కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఆధునిక విధానాలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కేంద్ర, రాష్ట్ర శాస్త్ర సమ్మేళనం సదస్సును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోదీ శనివారం ప్రారంభించారు. దేశాభివృద్ధిని వేగవంతం చేయడంలో శాస్త్ర, సాంకేతికత పాత్రను ఎత్తిచూపిన...నాలుగో పారిశ్రామిక విప్లవానికి నాయకత్వం వహించే దిశగా భారత్ పయనిస్తోందని మోదీ అన్నారు. 'సబ్కా ప్రయాస్ అనే మా మంత్రానికి కేంద్ర, రాష్ట్ర శాస్త్ర సమ్మేళనం ఒక ఉదాహరణ. నేడు, భారతదేశం నాల్గవ పారిశ్రామిక విప్లవానికి నాయకత్వం వహిస్తున్నందున, ఈ రంగంలో భారతదేశం శాస్త్ర పరిశోధన, వ్యక్తుల పాత్ర ముఖ్యం' అని తెలిపారు. 21వ శతాబ్దపు నూతన భారతదేశ అభివృద్ధికి, అన్ని రంగాల వృద్ధిని వేగవంతం చేయడంలో శాస్త్ర విజ్ఞానం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. శాస్త్రవేత్తలు సాధించిన విజయాలను ఎంతో ఉత్సాహంతో జరుపుకోవాలని పౌరులను ప్రధానమంత్రి కోరారు. 'మన శాస్త్రవేత్తలు సాధించిన విజయాలకు ఉత్సవాలు జరుపుకోవాలి. అప్పుడే సైన్స్ మన సంస్కృతిలో భాగమవుతుంది. మన ప్రభుత్వం శాస్త్ర విజ్ఞాన ఆధారిత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగుతోంది' అని అన్నారు. శాస్త్ర విజ్ఞాన ఆధారిత అభివృద్ధి అనే భావనతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. '2014 నుంచి శాస్త్ర, సాంకేతిక రంగంలో పెట్టుబడులు పెరిగాయి. ప్రభుత్వ కృషి కారణంగా భారతదేశం ప్రపంచ ఆవిష్కరణ సూచికలో 2015లో 81వ స్థానం నుంచి ఇప్పుడు 46వ స్థానానికి మెరుగుపడింది. నేటి యువత త్వరగా సాంకేతికతకు అలవాటు పడుతోంది. మనం పూర్తి శక్తితో వారికి మద్దతు ఇవ్వాలి' అని మోదీ అన్నారు. 'జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్' అనే మంత్రంతో భారతదేశం ముందుకు సాగుతుందని తెలిపారు. 'ఈ 'అమృత్ కాల్'లో భారతదేశాన్ని పరిశోధన, ఆవిష్కరణల ప్రపంచ కేంద్రంగా మార్చడానికి మనం వివిధ రంగాలలో కలిసి పని చేయాలి. శాస్త్ర సాంకేతిక రంగాలలో మన పరిశోధనలను స్థానిక స్థాయికి తీసుకెళ్లాలి. స్థానిక సమస్యలకు స్థానిక పరిష్కారాలను కనుగొనడానికి అన్ని రాష్ట్రాలు ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఇది' అని తెలిపారు. ఇందుకోసం ఆధునిక విధానాలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ శాస్త్రవేత్తలతో మరింత సహకారం అవసరమని నొక్కి చెప్పారు. 'ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని శాస్త్రీయ సంస్థల ఏర్పాటు, ప్రక్రియలను సరళీకృతం చేయడంపై దృష్టి పెట్టాలి. రాష్ట్రాల్లోని ఉన్నత విద్యా సంస్థలలో కూడా ఆవిష్కరణల ప్రయోగశాలల సంఖ్యను పెంచాలి' అని అన్నారు. సెప్టెంబర్ 10-11 తేదీల్లో అహ్మదాబాద్‌లోని సైన్స్ సిటీలో రెండు రోజుల సమ్మేళనం నిర్వహిస్తున్నారు. సమ్మేళనం ప్రారంభోత్సవంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పాల్గొన్నారు. శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కార్యదర్శులు, పరిశ్రమల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, యువ శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొంటారని తొలిసారిగా జరిగే ఈ సమ్మేళనంలో ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) తెలిపింది.

# జర్నలిస్టుల గురువు రాఘవాచారి

**విశాలాంధ్ర-విజయవాడ:** తెలుగు రాష్ట్రాల్లో ఉన్న తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ అన్ని భాషలకు చెందిన జర్నలిస్టులకు గురువుగా, మేధావిగా గుర్తింపు పొందిన మహనీయులు చక్రవర్తుల రాఘవాచారి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాఘవాచారి 83వ జయంతిని పురస్కరించుకుని శనివారం విశాలాంధ్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ రాఘవాచారి విద్యార్థి నాయకుడిగా, జర్నలిస్టుగా, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పని చేశారని తెలిపారు. ఎంత పెద్ద విషయాన్ని అయిన విశ్లేషించి చెప్పేవారని, ప్రపంచ రాజకీయాలను ఔపోసన పట్టిన వ్యక్తి అని కీర్తించారు. సుదీర్ఘ కాలం విశాలాంధ్రకు సంపాదకులుగా పని చేసి విశాలాంధ్ర రాఘవాచారిగా పేరు గడించారని చెప్పారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలకు చెందిన అనేక కార్యక్రమాల్లో వక్తగా పాల్గొనటమే కాకుండా కొన్ని సందర్భాల్లో ప్రేక్షకుడిగా కూడా హాజరయ్యేవారని, ఎలాంటి భేషజాలు లేకుండా వ్యవహరించే వారని తెలిపారు. రాఘవాచారికి విజయవాడలో తుది వీడ్కోలు ఘనంగా జరిగిందని గుర్తు చేసుకున్నారు. ముందుగా రాఘవాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, విశాలాంధ్ర డీజీఎం మనోహరనాయుడు, సీపీఐ విశాలాంధ్ర శాఖ కార్యదర్శి పి.మధుసూదనరావు, స్టేట్ బ్యూరో చీఫ్ చావా రవి, విశాలాంధ్ర సిబ్బంది పాల్గొన్నారు.

# ఐటీ శాఖ నుంచీ గ్రీన్ సిగ్నల్..

### అదానీ గ్రూప్ చేతికి ఎన్‌డీటీవీ!

**న్యూఢిల్లీ:** ఎన్డీటీవీలో అదానీ గ్రూప్ వాటాల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. విశ్వ ప్రధాన్ కమర్షియల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వారంట్స్‌ను ఈక్విటీ షేర్లుగా మార్చడానికి ఎన్డీటీవీకి చెందిన ప్రమోటర్ గ్రూప్ అయిన ఆర్ఆర్‌పీఆర్‌కు తమ నుంచి ఎలాంటి అనుమతులూ అవసరం లేదని ఆ శాఖ పేర్కొంది. స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో ఈ విషయాన్ని వీసీపీఎల్ తెలియజేసింది. రాధికారాయ్, ప్రణయ్ రాయ్‌కు చెందిన ప్రమోటర్ గ్రూప్ నుంచి వారంట్స్ మార్చే విషయంలో స్పష్టత కోసం సెప్టెంబర్ 7న ఆదాయపు పన్ను శాఖను వివరణ కోరగా.. ఆ శాఖ అదనపు కమిషనర్ ఆ మేరకు స్పష్టత ఇచ్చినట్లు వీసీపీఎల్ పేర్కొంది. దీంతో అదానీ గ్రూప్ చేతికి ఎన్డీటీవీ వెళ్లడం లాంఛనంగా కనిపిస్తోంది. ఎన్డీటీవీలో మెజారిటీ వాటా కొనుగోలు చేయనున్నట్లు గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ ఆగస్టు 23న ప్రకటించింది. గతంలో అదానీ గ్రూప్ కొనుగోలు చేసిన విశ్వప్రధాన్ కమర్షియల్(వీసీపీఎల్)కు చెల్లించాల్సిన రుణాన్ని ఎన్డీటీవీలో 29.18 శాతం వాటాగా మార్చుకోవడానికి అదానీ గ్రూప్ ముందుకొచ్చింది. తమకు సమాచారం ఇవ్వకుండానే ఇదంతా చేశారని ప్రమోటర్లు రాధికా, ప్రణయ్ రాయ్ పేర్కొన్నారు. ఆర్ఆర్‌పీఆర్ లిమిటెడ్‌లో ప్రమోటర్ల వాటాలను సొంతం చేసుకునేందుకు వీసీపీఎల్‌కు సెబీ అనుమతి అవసరమని ఎన్డీటీవీ ఎక్స్ఛేంజీకిచ్చిన ఫైలింగ్‌లో వారు పేర్కొన్నారు. అలాంటి అవసరం లేదని సెబీ అధికారులు పేర్కొనడంతో ఈ ఒప్పందానికి ఐటీ శాఖ నుంచి అనుమతులు అవసరమని మరోసారి రాయ్ దంపతులు ఎక్స్ఛేంజీకిచ్చిన సమాచారంలో పేర్కొన్నారు. ఐటీ శాఖ అధికారులు సైతం అలాంటి అనుమతులేవీ అవసరం లేదని చెప్పడంతో వారి ముందు ఇప్పుడు మరో దారి లేకుండా పోయింది. దీంతో వాటాలను అదానీ గ్రూప్‌నకు అప్పగించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎన్డీటీవీలో 26 శాతం అదనపు వాటాల కొనుగోలుకు సంబంధించి అదానీ గ్రూప్ బహిరంగ ప్రతిపాదనను ప్రకటించింది. ఈ ప్రతిపాదన అక్టోబర్ 17న ప్రారంభం కానుంది.

## ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త బీబీ లాల్ మృతి

**న్యూఢిల్లీ:** బీబీ లాల్‌గా ప్రసిద్ధి చెందిన ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త బ్రిజ్ బాసి లాల్ (101) కన్నుమూశారు. 'సుసంపన్నమైన గతంతో మన అనుబంధాన్ని మరింతగా పెంచిన' గొప్ప మేధావిగా ఆయన గుర్తుండిపోతారని ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. లాల్ 1968 నుంచి 1972 వరకు భారత పురావస్తు సర్వే (ఏఎస్ఐ)కు డైరెక్టర్ జనరల్‌గా పని చేశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టేజెస్ డైరెక్టర్‌గా కూడా పని చేశారు. అలాగే యునెస్కో వివిధ కమిటీలలో కూడా పాల్గొన్నారు. 1944లో సర్ మోర్టిమర్ వీలర్ అతనికి టాక్సిలాలో శిక్షణ ఇచ్చాడు. 70వ దశకం మధ్యలో అయోధ్య స్థలంలో ఇప్పుడు రామ మందిరం నిర్మిస్తున్న ప్రదేశంలో త్రవ్వకాలలో దేవాలయం లాంటి స్తంభాలను ఆయన కనుగొన్నారు. 2000వ సంవత్సరంలో బీబీ లాల్‌కి పద్మభూషణ్ పురస్కారం లభించింది. దీని తరువాత, ఆయన 2021లో పద్మవిభూషణ్ కూడా అందుకున్నారు. ఆయన మహాభారతం, రామాయణానికి సంబంధించి సింధు లోయ, కాళీబంగన్‌కు సంబంధించిన ప్రదేశాలలో విస్తృతంగా పరిశోధనలు చేశారు.

# న్యాయ వ్యవస్థలో మహిళల సంఖ్య పెరుగుతుంది

### సీజేఐ యు.యు.లలిత్

**పుదుచ్చేరి:** సమీప భవిష్యత్తులో న్యాయ వ్యవస్థలో పదవులు పొందే మహిళల సంఖ్య పెరుగుతుందని భారత ప్రధాన న్యాయమూర్తి యు.యు.లలిత్ అన్నారు. శనివారం ఇక్కడ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రభుత్వ న్యాయ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మహిళలు పెద్దఎత్తున న్యాయవిద్యకు ముందుకు రావాలంటూ లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వేడుకల సందర్భంగా చేసిన విజ్ఞప్తిని సీజేఐ ప్రస్తావించారు. ఒడిశా, జార్ఖండ్, రాజస్థాన్, తమిళనాడు సహా ఐదు రాష్ట్రాల్లో ఇప్పటికే న్యాయవ్యవస్థలో ప్రేరణ స్థాయిలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉందని చెప్పారు. న్యాయ కళాశాలల్లో 'న్యాయ నిర్ణయం' పాఠ్యాంశాన్ని చేర్చాలని, దీనివల్ల సంస్థలకు దూరమయ్యే యువ న్యాయవాదులు తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. కొన్ని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలలో న్యాయ నిర్ణయం అంశాన్ని చేర్చినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సీజేఐ లలిత్ సావనీర్‌ను విడుదల చేశారు. పెరియ కాలాపేట్ సమీపంలోని న్యాయ కళాశాల సమీపంలో న్యాయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడానికి ప్రాదేశిక పరిపాలన తన చొరవతో ముందుకు సాగుతున్నట్లు ఇక్కడి న్యాయ కళాశాల పూర్వ విద్యార్థి అయిన ముఖ్యమంత్రి ఎన్.రంగసామి తెలిపారు. పుదుచ్చేరిలో మద్రాసు హైకోర్టు బెంచ్ కోసం ఆయన బలమైన వాదన వినిపించారు. ప్రాక్టీసు ప్రారంభ దశలో ఉన్న యువ న్యాయవాదులకు పుదుచ్చేరి ప్రభుత్వం నెలవారీ రూ.9 వేల సహాయాన్ని అందజేస్తోందని రంగసామి తెలిపారు. ప్రసంగించిన వారిలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రాజా ఉన్నారు.

## గుజరాత్‌లో కాంగ్రెస్ 'బంద్'కు మిశ్రమ స్పందన

**అహ్మదాబాద్:** ఎన్నికల నేపథ్యంలో గుజరాత్‌లో ద్రవ్యోల్బణం, నిరుద్యోగానికి నిరసనగా శనివారం జరిగిన కాంగ్రెస్ పిలుపునిచ్చిన లాంఛనప్రాయ 'బంద్'కు ప్రజల నుంచి మిశ్రమ స్పందన లభించింది. రాష్ట్రంలోని వివిధ నగరాల్లో పార్టీకి చెందిన కొంతమంది సీనియర్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుజరాత్‌లోని వివిధ నగరాలు, పట్టణాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య బంద్‌కు మద్దతుగా దుకాణదారులను మూసివేయాలని కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీలు చేపట్టాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జగదీష్ ఠాకూర్‌తో పాటు పార్టీ కార్యకర్తలను నిర్బంధించగా, ఎమ్మెల్యేలు వీర్జి తుమ్మర్, పరేష్ ధనాని, విక్రమ్ మాడమ్ తదితరులను వివిధ పట్టణాలు, నగరాల్లో అరెస్టు చేశారు. వారు వ్యాపారులను దుకాణాలను మూసివేయాలని ప్రదర్శనలు చేపట్టారు. సూరత్‌లో పార్టీ కార్యకర్తలు దుకాణదారులకు గులాబీలను అందించాలని దుకాణాలను మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. 'గాంధేయ మార్గాల ద్వారా లాంఛనప్రాయ బంద్‌లో మేము గులాబీలను అందించి మద్దతు ఇవ్వాలని దుకాణదారులను అభ్యర్థించాము. ఇది ప్రజల ప్రయోజనాల కోసం అని వారికి చెప్పాము. తద్వారా ప్రజలు పిలుపునకు స్పందించారని ఈ అహంకార ప్రభుత్వం గ్రహించింది' అని సూరత్ కాంగ్రెస్ నాయకుడు అస్లాం సైకిల్‌వాలా అన్నారు. రాజ్‌కోట్‌లో అనేక మంది ఎన్ఎస్‌యూఐ నాయకులు కళాశాలల్లో తరగతులను నిలిపివేయాలని కోరడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పార్టీ కార్యకర్తలు టైర్లు తగులబెట్టి రహదారిని దిగ్బంధించారు. మెహసానాలోని ఖేరాలు, బనస్కాంతలోని పాలన్‌పూర్‌లో బంద్‌కు మిశ్రమ స్పందన లభించింది.

## అమరావతి రైతుల పాదయాత్రకు కోర్టు అనుమతి హర్షణీయం

### రావుల, రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఈనెల 12 నుంచి అమరావతి ప్రాంత రైతులు చేపట్టిన అమరావతి నుంచి అరసవల్లి వరకు పాదయాత్రకు డీజీపీ అనుమతి నిరాకరించగా రాష్ట్ర హైకోర్టు పాదయాత్రకు అనుమతి నివ్వటం పట్ల అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎ.కాటమయ్య శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రకరణ పేరుతో రాజధాని భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని విస్మరించి మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర ప్రజలను వంచించిందని తెలిపారు. గతంలో అమరావతి న్యాయ స్థానం నుంచి తిరుపతి దేవస్థానం వరకు రైతులు నిర్వహించిన పాదయాత్రకు ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు కల్పించినా విజయవంతమైందన్న వాస్తవాన్ని గ్రహించాలన్నారు. ప్రస్తుతం అమరావతి నుంచి అరసవల్లికి అమరావతి రైతులు చేపట్టిన పాదయాత్రకు అడ్డంకులు కల్పించాలనే దుష్ట ఆలోచనను ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం విరమించుకోవాలని వారు కోరారు. రైతులు చేపట్టిన పాదయాత్రకు రైతులు, రైతు, ప్రజాసంఘాల నేతలు స్వాగతం పలికి పాల్గొనాలని పిలుపునిచ్చారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఇప్పటికైనా రాష్ట్ర మంత్రులు, వైసీపీ నాయకులు రైతులను రెచ్చగొట్టే ప్రకటనలు చేయవద్దని వారు హితవు పలికారు.

## ఐఏఎస్ అధికారుల బదిలీలు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని కొందరు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తున్నట్లు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజా శంకర్‌ను బదిలీ చేసి స్టేట్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించింది. పౌరసరఫరాల శాఖ స్పెషల్ సెక్రటరీ, కమిషనర్‌గా అరుణ్‌కుమార్‌కు బాధ్యతలు కట్టబెట్టింది. జీఏడీ సెక్రటరీగా పోల భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:** బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని విశాఖపట్నం వాతావరణ శాఖ హెచ్చరించింది. గత మూడు రోజులుగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అయితే శనివారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరద పోటు అధికమైంది. రిజర్వాయర్లు, చెక్ డ్యామ్‌లు, గెడ్డలు, వరద నీటితో ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో వరి పంట నీట మునిగింది. అల్పపీడనం ప్రభావంతో కోస్తా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాలు, యానాంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, అలాగే దక్షిణ కోస్తా రాయలసీమ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు ప్రకటించారు. అల్పపీడన ప్రభావం వల్ల తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని అధికారుల హెచ్చరించారు. వర్షాల ప్రభావంతో కృష్ణా, గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. అలాగే దక్షిణ ఒడిశా, తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. పశ్చిమ తీరాన్ని ఆనుకొని కొనసాగుతున్న మరో ద్రోణి ప్రభావంతో కర్ణాటక, మహారాష్ట్ర లోనూ అక్కడక్కడ వర్షాలు పడతాయని వివరించారు.

## ఆహారం అందించేవారే బాధ్యులు

### వీధి కుక్కల సమస్యపై సుప్రీం

**న్యూఢిల్లీ:** వీధి కుక్కలకు రోజువారీ ఆహారం అందించే వారే ఇకపై ఆ కుక్కలు ఎవరినైనా కరిస్తే బాధ్యత తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. వాటికి టీకాలు కూడా చేయించాలని ఆదేశించింది. వీధికుక్కల బెడదకు పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని అత్యున్నత న్యాయస్థానం నిశ్చితాభిప్రాయం వ్యక్తం చేసింది. కేరళలో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందన్న పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. చాలామందికి కుక్కలంటే ప్రేమ ఉంటుందని, తాను కూడా డాగ్ లవరేనని జస్టిస్ ఖన్నా అన్నారు. వీధి కుక్కలకు ఆహారం పెట్టే వారు కుక్కల టీకా బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. కుక్కలకు ప్రత్యేకంగా మార్క్ చేయడమో, నంబర్లు వేయడమో చేయాలని అన్నారు. అవి ఎవరినైనా కరిస్తే వాటికి అయ్యే ఖర్చులకు బాధ్యత తీసుకోవాలన్నారు. సహజంగా వీధి కుక్కలు ఆహారం దొరకనప్పుడు, ఏదైనా జబ్బు సోకినప్పుడు క్రూరంగా ప్రవర్తిస్తూ దాడులు చేస్తుంటాయని ఆయన చెప్పారు. వీధి కుక్కలను సంరక్షించడం ఎంత అవసరమో...అమాయక ప్రజలు వాటి బారిన పడకుండా చూడటం కూడా అంతే అవసరమని ధర్మాసనం పేర్కొంది. పిటిషన్లపై వాదోపవాదాలు విన్న అత్యున్నత న్యాయస్థానం ఈ కేసులో తమ వాదనలను వినిపించేందుకు జంతు హక్కుల సంరక్షణ సంస్థలకు అనుమతి ఇస్తూ, తదుపరి విచారణను సెప్టెంబర్ 28వ తేదీకి వాయిదా వేసింది.

## మూసేవాలా హత్య కేసులో షూటర్ అరెస్టు

**చండీగఢ్:** సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య కేసులో పంజాబ్ పోలీసులు కీలక అరెస్టులు చేశారు. మూసేవాలా హత్యానంతరం పరారీలో ఉన్న షూటర్ దీపక్, అతని ఇద్దరు సహాయకులను అరెస్టు చేశారు. మే 29న పంజాబ్ సింగర్ మూసేవాలా దారుణహత్యకు గురయ్యారు. ఈ కేసులో పరారీలో ఉన్న షూటర్ దీపక్‌తో పాటు అతని సహాయకులు పండిట్, రాజేందర్‌లను పశ్చిమబెంగాల్-నేపాల్ సరిహద్దు వద్ద శనివారం అరెస్టు చేశారు. కేంద్ర సంస్థలు, ఢిల్లీ పోలీసులతో కలిసి పంజాబ్ పోలీసులు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో వీరు పట్టుబడ్డారు. సిద్ధూ మూసేవాలా హత్య వెనుక సూత్రధారి తానేనని గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ మూడు నెలల క్రితం అంగీకరించారు. గత ఏడాది ఆగస్టు నుంచి అతని హత్యకు పథకం వేసినట్లు చెప్పారు. ఈ కేసును పంజాబ్ ప్రభుత్వం సవాలుగా తీసుకుంది.

## రాహుల్ గాంధీపై... కేంద్ర మంత్రి ఇరానీ మండిపాటు

**బెంగళూరు:** దేశ ఐక్యతకు ఎవరు హాని చేశారో చెప్పాలని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ప్రశ్నించారు. భారత వ్యతిరేక నినాదాలు చేసిన నేతల్ని (కన్హయ కుమార్‌ను ప్రస్తావిస్తూ) పార్టీలోకి చేర్చుకున్న కాంగ్రెస్ దేశాన్ని ఏకం చేస్తామనడం హాస్యాస్పదమన్నారు. కర్ణాటకలో అధికారం చేపట్టి మూడేళ్లు పూర్తయిన నేపథ్యంలో శనివారం దొడ్డబళ్లాపూర్‌లో జన స్పందన పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. జోడో యాత్ర నేపథ్యంలో రాహుల్ గాంధీ చేసిన ప్రసంగాన్ని ఉటంకిస్తూ ఎవరు దేశాన్ని విడదీస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. అధికార దాహంతోనే రాహుల్ గాంధీ యాత్ర చేస్తున్నట్టు పేర్కొన్నారు. దేశానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది మీరే అంటూ విమర్శలు గుప్పించారు. దేశీయంగా కరోనా వాక్సిన్‌ను రూపొందించిన తరుణంలో వాక్సిన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రచారం చేసిందని ఆరోపించారు. గిరిజన మహిళ రాష్ట్రపతి అయితే ఆమెను ఆ పార్టీ నేతలు అవమానించారని దుయ్యబట్టారు. ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఆవిష్కరణను కూడా కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని ఆరోపించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.